సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 21 । మార్చి । 2024



వచ్చేఎన్నికల్లో విజయం.. అ'ద్వితీయం' - 8లో

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అన్నారు.



మానవ మనుగడకు పరిశోధనలు కీలకం - 8లో

మానవ మనుగడకు పరిశోధనలు అత్యంత కీలకమని ఐసీజీఈజీ డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ వి శొంటి అన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు (సా॥)	శుక్ర (ఉ॥)
6.12	4.38

వైద్యం చేరువ

- జిల్లా ఆవిర్భావం తర్వాత పెరిగిన వైద్యసేవలు
- ప్రభుత్వాస్పత్రుల్లో అధునాతన పరికరాలు
- పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రిలో గర్భిణుల కోసం ప్రత్యేక విభాగం
- తగ్గిన రిఫరల్ కేసులు
- పేదల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట



గిరిజనులు అధికంగా ఉండే... పాలకొండ, సీతంపేటల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వంద పడకల ఏరియా ఆస్పత్రులుగా మార్పు చేసింది. దీనివల్ల మెరుగైన వైద్యసేవలు ఇక్కడి ప్రజలకు చేరువయ్యాయి. రోజుకు ఒక్కో ఆస్పత్రిలో 200 నుంచి 300 వరకు ఓపీ ఉంటోంది. ప్రసవాలు సగటున 5–6 వరకు రోజుకు జరుగుతున్నాయి. గతంలో ఏ అత్యవసర పరిస్థితికి అయినా శ్రీకాకుళం రిఫర్ చేసేవారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడంతో ఆ సౌకర్యాలన్నీ ఇక్కడే లభిస్తున్నాయి. దీంతో పాటు పాలకొండ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ రోజుకు 40 మంది వరకు సేవలు పొందుతున్నారు. గతంలో ఈ సేవల కోసం శ్రీకాకుళం వెళ్లాల్సి వచ్చేది. వ్యయప్రయాసలకు లోనయ్యేవారు. ప్రస్తుతం వీరికి చికిత్సతోపాటు రూ.10 వేల పింఛన్ కూడా ఇస్తోంది రాష్ట్ర ప్రభుత్వం.

– పాలకొండ రూరల్

సాలూరు నియోజకవర్గంలోనూ అధికంగా గ్రామీణులు, గిరిజనులే. గతంలో ఏ చిన్న సమస్య వచ్చినా ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ వైద్యులే దిక్కు. నేడు అత్యాధునిక వైద్యసేదుపాయాలతో అప్‌గ్రేడ్ అయిన ఏరియా ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందుతున్నాయి. రోజుకు ఒక్క ఏరియా ఆసుపత్రిలోనే 250 నుంచి 350 వరకు ఓపీ ఉంటోంది. సమీపంలోని ఒడిశా నుంచీ రోగులు వస్తున్నారు. పంచాయతీకి ఒక సబ్ సెంటర్ కూడా ఉంది. అక్కడా విరివిగా సేవలు అందుతున్నాయి. అన్ని రకాల పరీక్షలూ అక్కడ చేస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రుల్లో రోగులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ఒక్క సాలూరు ఏరియా ఆస్పత్రిలోనే 22 మంది వరకూ వైద్యులు పని చేస్తుండటం విశేషం. ఫుల్లీ ఆటోమెటిడ్ ఎనలైజర్లు, మైక్రోస్కోపి, యూరిన్ ఎనలైజర్, ఐదు వెంటిలేటర్లు, రూ.15 లక్షల విలువైన సీఆర్ వంటి అధునాతన పరికరాలున్నాయి. మల్టీ స్పెషాలిటీ డాక్టర్లున్నారు. గత మూడేళ్లలోనే ఈ మార్పు సాధ్యమైంది.


– సాలూరు



సాలూరు ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఇచ్చే భోజనం



పార్వతీపురం జిల్లా ఆస్పత్రి



అందుబాటులో సీటీస్కాన్

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్:

పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందితే చాలు.. ఇంకేమీ ఆశించరు. అధిక శాతం కుటుంబాలు అప్పులపాలయ్యేది వీటి కోసమే. బడుగు, బలహీన వర్గాలకు ఈ రెండూ ఉచితంగానే అందించాలన్న సంకల్పంతో రాష్ట్రంలోని ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి నుంచి వీటికి అధిక ప్రాధాన్యమిస్తోంది. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ప్రభుత్వం.. ప్రతి పేదవానికీ మెరుగైన వైద్యం కోసం వైద్యసేవలను ప్రజల చెంతకే తీసుకొచ్చింది. ఉన్న సేవలను బలోపేతం చేసింది. అందుకు పార్వతీపురం మన్యం జిల్లా ఒక ఉదాహరణ. ఇక్కడి ప్రజల వైద్య అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఆవిర్భావం తర్వాత పార్వతీపురంలోని ఏరియా ఆస్పత్రి స్థాయిని పెంచింది. గతంలో 100 పడకలున్న ఆస్పత్రిని 150 పడకలుగా మార్పు చేసింది. జిల్లా ఆస్పత్రి కావడం వల్ల సేవలు మెరుగయ్యాయి. ప్రతిరోజూ సగటున 600కుపైగా ఓపీ నమోదవుతున్నాయి. ఇందులో 300 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఆస్పత్రిలో చికిత్సను అందుకుంటూ సేవలు పొందుతున్నారు. అత్యవసర విభాగాల్లో సేవలు సకాలంలో అందుతున్నాయి. అధునాతన వైద్య సామగ్రిని ఇక్కడ అందుబాటులో ఉంచారు. సిటీస్కాన్, జగనన్న ప్రాణ వాయువు ప్లాంట్, డయాలసిస్ సెంటర్ వంటివి ఏర్పాటు చేశారు. ఈ విభాగాలకు సంబంధించి సంబంధిత స్పెషలిస్టు పోస్టులను భర్తీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యసేవలు, పరీక్షలు అందుతుండటం వల్ల ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.వేలు, రూ.లక్షల్లో ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి తప్పిందని రోగులు చెబుతున్నారు.

జిల్లాలో గత మూడు నెలలుగా ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీల సంఖ్య		
నెల	ఓపీ	ఐపీ
డిసెంబరు 23	1,24,001	9,529
జనవరి 24	1,22,707	10,438
ఫిబ్రవరి 24	1,30,635	11,552

పెరిగిన సేవలు..



డయాలసిస్ విభాగం

జిల్లాలో మొత్తం 37 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఐదు యూపీహెచ్‌సీలు, చినమేరంగి, కురుపాం, జీఎల్ పురంల్లో సీహెచ్‌సీలు, సాలూరు, పాలకొండ, సీతంపేటల్లో ఏరియా ఆస్పత్రుల ద్వారా రోగులకు నాణ్యమైన సేవలందుతున్నాయి. సాలూరు, పాలకొండ, సీతంపేటల్లోని ఏరియా ఆస్పత్రులు గతంలో సీహెచ్‌సీలుగా ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే ఏజెన్సీలో వైద్య అవసరాలను గుర్తించి అప్‌గ్రేడ్ చేసింది. జిల్లా ఆస్పత్రి రావడం కిడ్నీ డయాలసిస్ రోగులకు వరంగా మారింది. ఇక్కడ రోజుకు 52 మంది వరకు డయాలసిస్ పొందే అవకాశం ఉంది. దీంతో పాటు.. జిల్లా ఆస్పత్రికి కీమో థెరపీ కూడా మంజూరైంది. 108 వాహనాలు 18.. 104 సేవలు 30 వాహనాల ద్వారా నిరంతరాయంగా సేవలు అందుతున్నాయి. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు 16 వాహనాల ద్వారా అందుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం ప్రభుత్వాస్పత్రుల్లోనే వైద్యసేవలు పొందుతున్నారు. గతంలో జేసీ భార్య, ఇటీవల కలెక్టర్ నిషాంత్‌కుమార్ భార్య జిల్లా కేంద్రాస్పత్రిలోనే పండంటి బిడ్డలకు జన్మనిచ్చారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యమిదీ... ఎక్కడా రూపాయి కూడా ఖర్చు లేకుండా మొత్తం వైద్యానికి అయ్యే ఖర్చు అంతటినీ తానే భరిస్తోంది.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు



ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. చాలా వరకూ ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయడం, స్పెషలిస్టు వైద్యులు రావడం, అధునాతన పరికరాలు సమకూర్చడం వల్ల రోగుల సంఖ్య పెరిగింది. ఎవరూ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడం లేదు. – డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

గర్భిణుల కోసం ప్రత్యేక ప్రసూతి విభాగం

ఏజెన్సీ ప్రాంతంలో గతంలో గర్భిణుల మరణాలు అధికంగా చోటు చేసుకునేవి. వీటిపైన దృష్టి సారించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. జిల్లా ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతల నిమిత్తం ప్రత్యేక విభాగాన్ని కేటాయించింది. 60 పడకలతో కూడిన గదులను రోగులకు అనుకూలంగా మార్చారు. గైనిక్, పిడి యాట్రిక్ వైద్యులతో సేవలందిస్తున్నారు. ప్రతీ బెడ్ కు జగనన్న ప్రాణవాయువు ప్లాంట్ ద్వారా ఆక్సిజ న్ అందే ఏర్పాట్లు చేశారు. 16 వరకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను ఈ విభాగం వద్ద సిద్ధంగా ఉంచారు. వీటితో పాటు అత్యవసర సేవల నిమిత్తం ప్రత్యేక వార్డును, డ్యూటీ డాక్టర్‌ను అందుబాటులో ఉంచారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలోని గర్భిణులు అత్యవసర సమయంలో పడిన ఇబ్బందులకు ఈ ప్రత్యేక వార్డుతో పరిష్కారం లభించింది.



మహిళల కోసం ప్రత్యేక ప్రసూతి విభాగం

అత్యంత శ్రద్ధ తీసుకుంటున్నాం...



రోగుల పట్ల అత్యంత శ్రద్ధ తీసుకుంటున్నాం. దాదాపు అన్ని సౌకర్యాలూ అందుబాటులో ఉండటం వల్ల రిఫరల్ చేయడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఒకట్రెండు, కేసులను రిఫర్ చేస్తున్నాం. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెరిగింది. వైద్యనిపుణులు సేవలందిస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం కాన్పుల కోసం వస్తున్నారు. వీరి పట్ల అత్యంత శ్రద్ధ తీసుకుంటున్నాం.

డా. బి.వాగ్దేవి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

న్యూస్‌రీల్

బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

పార్వతీపురం టౌన్: మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు/రెన్యువల్‌కు బ్యాంకు అకౌంటుకు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ బుధవారం తెలిపారు. ఆధార్ సీడింగ్ లేకుంటే స్కాలర్‌షిప్ జమ కాదన్నారు. ప్రతి విద్యార్థి తమ మెరిట్ కార్డ్, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకొని సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆధార్‌సీడింగ్ చేయించుకోవాలని సూచించారు. విద్యా మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ వారు నేరుగా విద్యార్థి ఆధార్‌కు సీడ్ అయిన బ్యాంకు ఖాతాలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో స్కాలర్‌షిప్ జమ చేస్తారని తెలిపారు. స్కాలర్‌షిప్ స్టేటస్ విద్యార్థి లాగిన్‌లో మాత్రమే తెలుస్తుందన్నారు.

పదో తరగతి పరీక్షలకు 99.20 శాతం హాజరు

పార్వతీపురం టౌన్: జిల్లాలో బుధవారం జరిగిన పదోతరగతి ఇంగ్లిష్ పరీక్షకు 99.20 శాతం మంది హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 66 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. 10,554 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 10,470 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 84 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు. 24 మంది ప్రత్యేక స్క్వాడ్ సిబ్బంది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు.

వీఆర్ పురం పరిసరాల్లో ఏనుగుల గుంపు



వి.ఆర్.పురం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని వీఆర్ పురం పరిసర ప్రాంతాల్లో ఏనుగులు బుధవారం సంచరించాయి. కొమరాడ మండలం పాతదుగ్గి నుంచి బాసంగి మీదుగా వీఆర్ పురం పంట పొలాల్లోకి చేరుకున్నాయి. ఈ ప్రాంతంలో వరి, అరటి, జొన్న పంట సాగులో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ సిబ్బంది స్పందించి పంటలకు నష్టం కలిగించకముందే ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన అవసరం

- డీసీహెచ్‌ఎస్ వాగ్దేవి



అవగాహన కల్పిస్తున్న డీసీహెచ్‌ఎస్ డా. వాగ్దేవి

పార్వతీపురం టౌన్: నోటి ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరని డీసీహెచ్‌ఎస్ డా.వాగ్దేవి అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన కల్పించారు. నోటి శుభ్రతపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్రమం తప్పకుండా బ్రష్ చేయడం, ఫ్లాసింగ్ చేయడం వల్ల నోటిలోని క్రిములను తొలగించవచ్చన్నారు. నోటిశుభ్రత లేకుంటే కావిటీస్, చిగుళ్ల వ్యాధి, నోటి దుర్వాసనకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో దంతవైద్యులు డా.ఎం.దినేష్, డా.ఆర్.శ్యామల, డా.కె.సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి 30 గొర్రె పిల్లల మృతి



పిడుగుపాటుకు గురై మృతి చెందిన గొర్రె పిల్లల దగ్గర దిగాలుగా కూర్చున్న కాపరులు

తెర్లాం: విజయనగరం జిల్లా తెర్లాం మండలంలోని వి.చిన్నయ్యపేట, లోచర్ల గ్రామాలకు చెందిన యాదవులు కాగాం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో కాస్తున్న గొర్రెల మందపై మంగళవారం అర్ధరాత్రి పిడుగుల వర్షం కురిసింది. దీంతో మందలో ఉన్న 30 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితులు వెన్నెల రాము, వెన్నెల కృష్ణ బోరున విలపిస్తున్నారు. పిడుగు పడిన సమయంలో గొర్రెలు వేరే ప్రాంతంలో ఉండడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే వీఆర్వో ఎల్.గణపతి, పశుసంవర్థక శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నష్టం నివేదికను తహసీల్దార్‌కు అందజేస్తామని చెప్పారు. జీవాల పెంపకం దారులను ఆదుకుంటామని తెలిపారు.

అందరిపైనా అమ్మవారి చల్లని కరుణ



ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, నాయకులు, ప్రజాప్రతినిధులు

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అమ్మవార్ల చల్లని కరుణ అందరిపైనా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ముత్యాలమ్మ తల్లికి బుధవారం పూజలు చేశారు. సాలూరు పట్టణంలోని బ్రిడ్జి సమీపంలో పునర్నిర్మించిన ముత్యాలమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రాజన్నదొరకు ఆలయకమిటీ సభ్యులు సాదరస్వాగతం పలికారు. అమ్మవార్లకు ఉపముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సర్వేలైన్స్ బృందాలు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఎన్నికల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎంసీసీ టీమ్, ఖర్చు వివరాలు నమోదు టీమ్‌లు బాధ్యతగా పనిచేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి ఆదేశించారు. ఎన్నికల సిబ్బందితో బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీలు, సమావేశాలను వీడియోలు తీసి ఖర్చులను సంబంధిత అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని సూచించారు. అన్ని టీమ్‌లు తమ రిపోర్ట్‌ను ప్రతిరోజు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందజేయాలన్నారు.

ఎన్నికల నియామావళి ఉల్లంఘిస్తే చర్యలు

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన క్షణం నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన అనుమతులను తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, విలేకరులతో వేర్వేరుగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులు ఉండవని, వాటి కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించబోమని చెప్పారు. జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడానికి ఒక చోట నుంచి మరో చోటకి ఓటు బదిలీకి మాత్రం అవకాశం ఉందన్నారు. కొత్తగా ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు పెటాలన్నా, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలన్నా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

అభ్యర్థుల ఖర్చులో పెయిడ్ న్యూస్

ఎలక్ట్రానిక్ మీడియా చానెల్స్, రేడియో, సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్, డిజిటల్ బోర్డుల్లో ప్రకటనలు ఇవ్వాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఆటోలు, బస్సులు తదితర ప్రజారవాణా వాహనాల్లో కూడా అనుమతి లేకుండా రాజకీయ పార్టీల స్టిక్కర్లు, బ్యానర్లు పెట్టకూడదని స్పష్టం చేశారు. పేపర్‌లో ప్రకటనలు ఇవ్వడానికి ముందస్తు అనుమతి అవసరం లేదని, పెయిడ్ న్యూస్‌ను అభ్యర్థుల ఖాతాల్లో ఖర్చుగా రాయనున్నామని వివరించారు. ఫిర్యాదులను పబ్లిక్ యాప్ సీ–విజిల్ ద్వారా సేకరిస్తామన్నారు.

కనులపండువగా శ్రీనివాసుని కల్యాణం

డెంకాడ: చింతలవలస ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో రుత్వికుల వేదమంత్రాల సాక్షిగా అలివేలు మంగ, పద్మావతి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. పెండ్లి కుమారుడు తరపున వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బద్దుకొండ ప్రదీప్, సిరిసహస్రలు దంపతులు, పెండ్లి కుమార్తెలు తరపున బెటాలియన్ కార్యాలయ ఓసీ సూర్యచంద్రశేఖరరావు, సత్యపల్లవి దంపతులు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో బెటాలియన్ కమాండెంట్ గౌతమీశాలి, పోలీస్ కుటుంబ సభ్యులు, అధికారులు పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.





శ్రీనివాసుని కల్యాణాన్ని తిలకిస్తున్న పోలీస్ కుటుంబాలు, భక్తులు (ఇన్‌సెట్లో) శ్రీవారి కల్యాణోత్సవ పూజచేస్తున్న బద్దుకొండ ప్రదీప్, సిరిసహస్ర దంపతులు, సూర్యచంద్రశేఖరరావు, సత్యపల్లవి దంపతులు

చల్లంగ చూడమ్మా.. చిన్నమ్మతల్లీ..

రామభద్రపురం: భక్తుల ఇలవేల్పు చిన్నమ్మతల్లి అమ్మవారి జాతర మూడురోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి బుధవారం ఉదయం 12 గంటల వరకు అమ్మవారి ఘటాలను భక్తులు తిరువీధి జరిపారు. వసంతుల వీధి రామమందిరం వద్ద ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అంజలిరథోత్సవం నిర్వహించి అనంతరం అమ్మవారిని భక్తి శ్రద్ధలతో గుడివద్దకు సాగనంపారు. పసుపు, కుంకుమ, గాజులు, చీరలను సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్లను చూపించి మొక్కుబడులు చెల్లించారు. పాడి పంటలు కలిసిరావాలని, ఆయురారోగ్యాలు బాగుండేలా చూడమ్మా అంటూ అమ్మవారికి ప్రార్థించారు. అనంతరం అనుపోత్సవం జరిపారు.

మన్యంలో విస్తారంగా వర్షం



సీతంపేట: రేగుమానుగూడలో విరిగి పడిన విద్యుత్ స్తంభం



సీతంపేట ఐటీడీఏ వద్ద కురుస్తున్న వర్షం



పాలకొండ రూరల్: రుద్రిపేటలో తడిసిన కట్టె జనుము ఓవులు

పాలకొండ/సీతంపేట/భామిని: పార్వతీపురం మన్యం జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి కొన్ని చోట్ల కుండపోతగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. చెరువుల్లో నీరు చేరింది. రబీ పంటల సాగుకు వర్షాలు ఉపయోగపడతాయని పాలకొండ వ్యవసాయశాఖ ఏడీ రత్న కుమారి తెలిపారు. వేసవి దుక్కులు చేసుకుని హైబ్రీడ్ పెసర సాగు చేసుకునేందుకు వాతావరణం అనుకూలమని పేర్కొన్నారు. ఇప్పటికే నువ్వ పంట సాగు చేస్తున్న రైతులు పొలంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పండ్ల తోటలకు వర్షం మేలుచేస్తుందని పేర్కొన్నారు.

- సీతంపేట మండలం హడ్డుబంగి పంచాయతీ పరిధి రేగుమానుగూడలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలలతో మామిడి, జీడిపూత రాలిపోయిందని రైతులు తెలిపారు.
- వాన జోరుకు భామిని మండలంలోని బత్తిలి సంతోషిమాత ఉత్సవాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలంకరణ చిందవందరగా మారింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడ్డారు.

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలో సాగుచేస్తున్న కట్టెజనుము పంటకు నష్టం వాటిల్లిందంటూ రైతులు వాపోతున్నారు. ఈదురుగాలులకు అరటి చెట్లు విరిగిపోయినట్టు ఎల్.ఎల్.పురం, గోపాలపురం, అన్నవరం గ్రామాల రైతులు తెలిపారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శివ మృతదేహం

గంట్యాడ: బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని వసాది గ్రామం సమీప కొత్త వెలగాడ జంక్షన్‌లో ఈనెల 16వ తేదీ సాయంత్రం జరిగిన రెండు బైక్‌లు ఢీకొనడంతో ఎస్.కోట మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన కార్పెంటర్ ముసినాన శివ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ పరిస్థితి కుదుట పడకపోవడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన తారకేశ్వరుడు(ఫైల్)

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కుసుమ గుడి వీధికి చెందిన బీటెక్ విద్యార్థి కల్లూరి తారకేశ్వరుడు(20) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలో గల సెంచూరియన్ యూనివర్సిటీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న తారకేశ్వరుడు చదువులో రాణించలేకపోతున్నానని మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేనప్పుడు శ్లాబ్‌కు ఉన్న హుక్‌కు ఉరివేసుకున్నాడు. దీనిపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పట్టణ ఎస్సై సంతోషి కుమారి తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

ముద్దాయికి 11 ఏళ్ల జైలు శిక్ష

విజయనగరం క్రైమ్/ రామభద్రపురం: 2017లో జరిగిన కేసు విచారణలో నేర నిర్ధారణ అనంతరం ముద్దాయికి 11 ఏళ్లు జైలు శిక్ష పడింది. బుధవారం వెలువడిన ఈ తీర్పు గురించి ఎస్సై జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలంలోని రొంపల్లికి చెందిన ముదిలి కృష్ణ 2017లో అదే గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. తర్వాత పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలి తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ కేసులో సుమారు 7 ఏళ్లు నిందితుడిపై విజయనగరం సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణలో నిజం నిరూపితం కావడంతో స్పెషల్ జడ్జి ఎస్.పద్మావతి ముద్దాయికి 11 ఏళ్లు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. అప్పటి బొబ్బిలి సీఐ జి.సంజీవరావు కేసునమోదు చేయగా, మరో సీఐ రామకృష్ణ దర్యాప్తు చేసి నిందితుడిపై కోర్టులో కేసు ఫైల్ చేశారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్రనాథ్ వాదనలు వినిపించగా, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు పర్యవేక్షణలో రామభద్రపురం ఎస్సై జ్ఞానప్రసాద్, కోర్టు హెచ్‌సీ ఎం.గణేష్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు.

వైభవంగా రామాలయ ప్రతిష్టాపన పూజలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆల్తిపాలెం గ్రామంలో ఇటీవల పునర్నిర్మించిన రామాలయ ప్రతిష్టాపన పూజలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. మంగళవాయిద్యాలు, వేద పండితుల వేద మంత్రోచ్చారణ నడుమ శిఖర ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, తదితరులు ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు.

చికెన్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

వచ్చే ఎన్నికల్లో విజయం.. అ'ద్వితీయం'

- వైఎస్సార్‌సీపీకే మళ్లీ అధికార పగ్గాలు
- జగన్‌మోహన్‌రెడ్డిదే మరోసారి ముఖ్యమంత్రి పీఠం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సునాయాసంగా విజయం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని, మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన విజయనగరంలోని ఫూల్‌బాగ్ ప్రాంతంలో గల శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నగరంలోని డివిజన్లకు నియమించిన ఎన్నికల పరిశీలకులు, 1,2,3,12,13,14 డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు, డివిజన్‌ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓటమి భయంతో పొత్తుల కోసం పరిగెత్తడమే ఇందుకు తార్కాణంగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంటే టీడీపీ ఒంటరిగా 175 స్థానాల్లో పోటీ చేసేదని, అటువంటి పరిస్థితి లేకనే చంద్రబాబు ఇతర పార్టీలతో కలిసి పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

సినీ గ్లామర్‌తో సాధ్యమా?

2014 ఎన్నికల్లో రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతానంటూ పోటీ చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ 2024లో జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెడితే చాలన్న పరిస్థితికి దిగజారిపోయారన్నారు. కేవలం సినీ గ్లామర్ చూపించి రాజకీయాల్లో రాణించడం సాధ్యం కాదని, ఆ విషయాన్ని యువఓటర్లకు అవగాహన కల్పించాలని, ప్రతిపక్షాలు విసిరే ప్రలోభాల వలలో పడవద్దని తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ, నాయకులు, కార్యకర్తలకు కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు.



హాజరైన వివిధ డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు

బూతద్దంలో వెతికినా తప్పు పట్టలేరు

40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎంతో మంది అభిమానులతో పాటు కొంత మంది శత్రువులు తయారయ్యారని కోలగట్ల వీరభద్రస్వామి ఓటమే ధ్యేయంగా అందరూ ఒక దగ్గరకు చేరుతున్నారన్నారు. ఎంత మంది ఒక దగ్గరకు చేరినా ప్రజాబలం ఉన్న వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు కొందరు మైండ్ గేమ్ ఆడుతున్నారని పట్టించుకోవాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. తన హయాంలో ఏం తప్పులు జరిగాయో పట్టుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని , బూతద్దం, బయోస్కోప్ పెట్టి చూసినా ఒక తప్పు కనిపించదన్నారు. వైఎస్సార్ సీపీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని ప్రలోభాలకు లొంగవద్దని కోరారు.

పార్టీ శ్రేణుల ఉత్సాహమే విజయానికి నాంది

మీ ఉత్సాహం చూస్తుంటే ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామన్న భావన స్పష్టంగా కనిపిస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో నాయకుడు, కార్యకర్తలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లినప్పుడే ఆ పార్టీకి మనుగడ ఉంటుందని, ఆ ఉత్సాహం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ప్రస్ఫుటంగా తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు లంచానికి తావు లేకుండా అర్హులకు అందజేయడం దేశంలో ఎక్కడా జరగలేదని పేర్కొన్నారు.

అశోక్‌గజపతిరాజు రోడ్డెక్కితే ఎన్నికలొచ్చినట్లే

కష్టపడేది మనం..అభివృద్ధిచేసేది మనం..ప్రజా సంక్షేమాన్ని అమలు చేసేది వైఎస్సార్‌సీపీ అయితే..4 ఏళ్ల 10 నెలల కాలం ప్రజలకు కనిపించని కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు లాంటి వాళ్లు ఎన్నికలు రావడంతో రోడ్డెక్కుతారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఎద్దేవా చేశారు. సమావేశంలో అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి జాతర ఆదాయం రూ.22,39,349

- లెక్కించిన దేవస్థానం కమిటీ
- హుండీల ద్వారా రూ.12,85,101
- టికెట్ల రూపంలో రూ.9,54,248
- గత ఏడాది కంటే రూ.1,42,473 పెరుగుదల



అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: భక్తుల కొంగుబంగారం, చీపురుపల్లిలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాల సందర్భంగా జరిగిన మూడురోజుల ఉత్సవంలో రూ.22,39,349 ఆదాయం లభించింది. ఈ నెల 17, 18,19 తేదీల్లో మూడు రోజుల పాటు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర వేడుకగా జరిగింది. ఈ మూడు రోజుల జాతరకు లభించిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. అమ్మవారి దేవస్థానంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, దేవస్థానం కమిటీ ఛైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్‌ఛైర్మన్ సూరు కుమార్‌ల నేతృత్వంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా జాతరలో అమ్మవారికి భక్తులు హుండీల్లో సమర్పించుకున్న దక్షిణల ద్వారా రూ.12,85,101 లభించింది. అలాగే అమ్మవారిని దర్శించుకునేందుకు దేవదాయశాఖ ఏర్పాటు చేసిన రూ.10, రూ,20, రూ,50, రూ,100 టికెట్ల రూపంలో రూ.9,54,248 ఆదాయం వచ్చింది. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,42,473 ఆదాయం పెరిగింది. అయితే జాతర మూడు రోజుల్లో చివరి రోజు మంగళవారం అత్యధికంగా భక్తుల రద్దీ ఉంటుంది. అయితే చివరిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో భక్తుల రద్దీకి ఆటంకం కలిగింది. దీంతో కాస్త ఆదాయం తగ్గినట్లు దేవదాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ.లక్ష్మి, ఈఓ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాలు తగ్గుముఖం

- 10 చోట్ల ఫ్లై ఓవర్‌ల నిర్మాణంతో యాక్సిడెంట్లకు చెక్
- ధైర్యంగా ప్రయాణిస్తున్న వాహనచోదకులు



పూసపాటిరేగలో ఫ్లై ఓవర్

పూసపాటిరేగ: విజయనగరం జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాలను కలుపుతూ వెళ్తున్న జాతీయరహదారిలో ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తి కావడంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. గ్రామాలు ఉన్న చోట జాతీయరహదారిపై ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు విడిచి, కొంతమంది క్షతగాత్రులుగా మిగిలేవారు. ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తయిన తరువాత వాహనాలు వంతెన పైనుంచి వెళ్లడంతో ట్రాఫిక్ తగ్గి ప్రమాదాలకు అడ్డుకట్ట పడింది. కోనాడ, సీహెచ్ అగ్రహారం, మైలాన్, కనిమెట్ట జంక్షన్‌లు, కందివలస గెడ్డ వద్ద ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తి కావడంతో ప్రస్తుతం ట్రాఫిక్ ఇబ్బందులు లేవు. అలాగే భోగాపురం మండలంలో సుందరపేట, భోగాపురం, అక్కివరం, రావాడ, పోలిపల్లి జంక్షన్‌లలో ఫ్లై ఓవర్లు ఉండడంతో ఆయా గ్రామాల పరిధిలో కూడా ప్రమాదాలు తగ్గాయి. ఎంతో కాలంగా ఇబ్బంది పడుతున్న వాహనచోదకుల సమస్య తీరడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణంతో తగ్గిన ప్రమాదాలు

హైవేపై ఫ్లై ఓవర్‌ల నిర్మాణం జరగడంతో ప్రమాదాలు తగుముఖం పట్టాయి. జాతీయరహదారిపై జంక్షన్‌లలో గ్రామాలు ఉన్న చోట్ల ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తి కావడంతో వాహనాలపై ప్రయాణం చేసేందుకు ధైర్యంగా ఉంది.

– కప్పల కృష్ణ, వాహనచోదకుడు, పూసపాటిరేగ

'వైభవ్'ంగా జ్యుయలరీ షాప్ ప్రారంభం



రాజాంలో వైభవ్ జ్యుయలరీ షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో గల సీతారామ కాంప్లెక్స్‌లో వైభవ్ జ్యుయలరీ షాపును బుధవారం వైభవంగా ప్రారంభించారు. షాపు ప్రారంభానికి ముందుగా సీతారామ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ సీపీ జగన్నాథస్వామి, వైభవ్ సీఎండీ గ్రంధి భారత మల్లిక రత్నకుమారి, సీఓఓలు గ్రంధి అమరేంద్ర, గొండ్ల రాఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, కంకటాల టెక్స్‌టైల్స్ సీఎండీ కంకటాల మల్లిక్ తదితరులు జ్యోతి ప్రజల్వనచేసి కస్టమర్స్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎండీ గ్రంధి భారత మల్లిక రత్నకుమారి మాట్లాడుతూ కోస్తా ఆంధ్రా, తెలంగాణ, ఉత్తరాంధ్రలో తమ జ్యూయలరీ ఎంతో ప్రాముఖ్యం పొందిందన్నారు. ఉత్తమ నాణ్యత, అనువైన ధరలతో విభిన్న డిజైన్‌లలో బంగారు ఆభరణాల, వజ్రాభరణాలు, ప్లాటినం, రత్నాలు, వెండి ఆభరణాలు, పూజా వస్తువులను ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు అందించేందుకు రాజాంలోని సీతారామ కాంప్లెక్స్‌లో 14 షోరూమ్‌ను ప్రారంభించామని వెల్లడించారు. రాజాం పట్టణ వాసులకు సుపరిచితమైన విశాఖపట్నం వైభవ్ జ్యుయలర్స్ విస్తృతమైన శ్రేణి, అద్భుతమైన పనితనంగల ఆభరణాలను ఇప్పుడు రాజాంలో అందించగలగడం శుభపరిణామమన్నారు. షాపు ప్రారంభోత్సవ కానుకగా బంగారు ఆభరణాలపై తరుగు 9 శాతం నుంచి, ఒక గ్రాము బంగారానికి రూ.150 తగ్గింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రాజాం పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు పాల్గొన్నారు. తొలిరోజు క్విజ్ కాంటెస్ట్ పెట్టి పదిమంది విజేతలకు బహుమతులు అందించారు.

లెండిలో ముగిసిన స్టూడెంట్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రోగ్రామ్‌బుల్ లాజిక్ కంట్రోలర్‌పై రెండు రోజులుగా జరుగుతున్న నేషనల్ లెవెల్ వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఎంకోర్ టెక్నాలజీస్ సహాయంతో జరిగిర ఈ వర్క్‌షాప్‌లో ఇండస్ట్రీలో పీఎల్‌సీ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు, అధ్యాపకులు, ఎంకోర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ సాయి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, విభాగాధిపతులు కె.సుబ్బరామయ్య, బీవీఎస్ ఆచార్యులు, పి.జానకి తదితరులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 57మంది ఎంపిక



కళాశాల అధ్యాపక సిబ్బందితో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలోని అవంతి సెయింట్ థెరిశా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 57 మంది బీటెక్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన డాట్సోల్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఆ సంస్థ ప్రతినిధి ప్రసాద్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.జాషువాజయప్రసాద్ మాట్లాడుతూ క్యాంపస్ ఇంటర్వ్యూకు 177 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో 15 టీడీపీ కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

గంట్యాడ: మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామానికి చెందిన 15 టీడీపీ కుటుంబాల వారు టీడీపీని వీడి గ్రామ సర్పంచ్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పల నరసయ్య మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో రఘుమజ్జి సన్యాసినాయుడు (హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్, రఘుమజ్జి నారాయణరావు, బవిరెడ్డి ముసలి నాయుడు, శిరపురపు సత్యనారాయణ, వెంపడాపు సూర్యనారాయణ, కలిశెట్టి శ్రీను, నెట్టి బాలకృష్ణ , పోలిపల్లిపైడితల్లి, మొయిద రమణ, కలిశెట్టి పాపారావు, టొంపలి రాము తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెదభోగిలిలో 10 కుటుంబాలు..

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీ అప్పయ్యపేటలో టీడీపీకి చెందిన 10 కుటుంబాల వారు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు పెదభోగిలి పంచాయతీ అప్పయ్యపేటలో ఎంపీటీసీ బి.కుసుమ నివాసంలో బుధవారం పార్టీలో చేరికల కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కారణంగా ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామని సబ్బాన తవిటినాయుడు, అల్లు సత్యనారాయణ, ఎస్ సింహాచలం, కె శంకరరావు, జి భాస్కరరావు, కె శ్రీనివాసరావుతో పాటు 10 కుటుంబాల వారు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిందన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయడానికి ముందుకు వచ్చిన వారికి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పెదభోగిలి వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు సవరపు రామారావు మాస్టారు, సబ్బాన అనందరావు, జి.లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

390 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితుడు ముస్తక్‌ఖాన్‌తో ఎస్‌ఈబీ అధికారులు

శృంగవరపుకోట: గుట్టుగా సాగుతున్న అక్రమ రవాణను అడ్డుకున్న ఎస్.కోట ఎస్‌ఈబీ అధికారులు 350 కిలోల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎవరికీ అనుమానం రాని రీతిలో లారీ క్యాబిన్‌లో గంజాయి తరలించేందుకు అక్రమార్కులు స్కెచ్ గీశారు. ఆ ప్రకారం లారీ క్యాబిన్‌లో డ్రైవర్ సీటు పైనున్న టాప్ బోయినెట్‌లో 150 ప్యాకెట్లలో గంజాయి సర్దిపెట్టారు. 300కిలోల గంజాయిని హద్దులు దాటించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అదే సమయంలో హర్యానాకు చెందిన లారీలో భారీగా గంజాయి రవాణా అవుతోందని లారీ ఎస్‌కోట మీదుగా వెళ్తోందని ఎస్‌ఈబీ అధికారులకు సమాచారం అందింది. దీంతో అలెర్ట్ అయిన ఎస్‌ఈబీ అధికారులు బొడ్డవర జంక్షన్‌లో మాటువేసి ఉదయం 8.45గంటల సమయంలో అరకు నుంచి వస్తున్న లారీని ఆపి సోదా చేశారు. క్యాబిన్‌లో డ్రైవర్ సీటు పైన ఉన్న బోయినెట్‌లో గంజాయి పట్టు బడడంతో లారీని, గంజాయిని స్వాధీనం చేసుకుని, రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ ముస్తక్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఈబీ అసిస్టెంట్ సూపరిండెంట్ డీవీజీ రాజు విలేకరుల సమావేశంలో చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.10లక్షల వరకు ఉండవచ్చని, గంజాయి స్మగ్లింగ్ కేసులో లారీ డ్రైవర్ ముస్తఖ్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. సోదాల్లో పాల్గొన్న సీఐ సంతోష్, ఎస్సై జి.ఫణీంద్ర తదితర సిబ్బందిని ఆయన అభినందించారు.

విజయనగరంలో తొమ్మిది కిలోలు..

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఓల్డ్ రైల్వేక్వార్టర్స్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, నిందితుడి దగ్గర తొమ్మిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని బట్వాడ గ్రామం మంగళూరు సౌత్ కనడా డిస్ట్రిక్ట్‌కు చెందిన మహమ్మద్ అజారుద్దీన్ రైల్వేస్టేషన్ వద్దనున్న ఓల్డ్ రైల్వే క్వార్టర్స్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు సమాచారం అందుకున్నారు. దీంతో ఎస్సై నవీన్ పడాల్ సంఘటనా స్థలానికి చేరుకుని అజారుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి దగ్గరనుంచి కిలోన్నర చొప్పున ఆరు గంజాయి ప్యాకెట్లు మొత్తం తొమ్మిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

ఆకట్టుకున్న ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన

వేపాడ: మండలంలోని వావిలపాడు పంచాయతీ కడకొండ గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శనలో 14 జతల ఎడ్లు పాల్గొనగా కేఎల్‌బీ పటానికి చెందిన బి.మోహన్ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.12వేలు గెలుచుకున్నాయి. అలాగే రెండోస్థానంలో నిలిచిన వావిలపాడుకు చెందిన గండి వెంకటరావు ఎడ్లు రూ.పదివేలు, మూడో స్థానంలో నిలిచిన సింహాద్రిపురానికి చెందిన అభయాంజనేయస్వామి ఎడ్లు రూ.ఎనిమిది వేలు గెలిచాయి. విజేతలకు నగదు బహుమతులను గ్రామ పెద్దల చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు.

మానవ మనుగడకు పరిశోధనలు కీలకం

- శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ వి.శొంటి



శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌ను సత్కరిస్తున్న సెంచూరియన్ వీసీ పీకే మహంతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మానవ మనుగడకు పరిశోధనలు అత్యంత కీలకమని ఐసీజీఈబీ డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ వి శొంటి అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో స్మార్ట్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో మిషామ్–2024 సదస్సు ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఆయన మాట్లాడుతూ ఆహార ధాన్యాల దిగుబడులు అధికంగా ఉండాలంటే పంటకు చీడ, పీడల బెడద ఉండరాదన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెంది వృక్ష శాస్త్రవేత్తలు, పరిశోధకులు కలిసి పరస్పర శాస్త్రీయ చర్చలు జరపడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వర్సిటీ ప్రతినిధులు శాస్త్రవేత్త రమేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశాంతి పార్టీతోనే శాంతి

- ఎస్.కోటలో కె.ఎ.పాల్ ఉద్బోధ



బెరాకాచర్చిలో మహిళలతో మాట్లాడుతున్న కె.ఎ.పాల్

శృంగవరపుకోట: ప్రజా శాంతి పార్టీ పాలనతోనే రాష్ట్రంలో శాంతి, సౌఖ్యం సాధ్యమని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఎ.పాల్ చెప్పారు. ఎస్.కోట పట్టణంలోని బెరాకా చర్చిలో క్రైస్తవ మత ప్రచారకులు, ఫాదర్‌లు, పాస్టర్లతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచార సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.25వేలు, వితంతువులకు రూ.5వేలు చొప్పున పింఛన్లు ఇస్తామన్నారు. విశాఖ ఎంపీ నియోజకవర్గంలో ప్రీకేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్యను అందించేలా యూనివర్సిటీ, ఉచితవైద్యం అందేలా అధునాతనమైన, అతి పెద్ద ఆస్పత్రిని కట్టించే సత్తా తనకు మాత్రమే ఉందన్నారు.

ఆంధ్రాలో ప్రజాశాంతి పార్టీ నుంచి 100 మంది ఎమ్మెల్యేలను, విశాఖ నుంచి తనను ఎంపీగా గెలిపించాలన్నారు. ఎస్.కోట నుంచి ఎమ్మెల్యేగా తనను పోటీ చేయాలని పలువురు కోరుతున్నారని, ఈ విషయమై ఆలోచిస్తున్నానని చెప్పారు.